సాక్షి తిరుపతి
మంగళవారం ౹ 24 ౹ డిసెంబర్ ౹ 2024



విహంగమా..చూసితరిద్దామా!
ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి 10, 11, 12 తేదీలలో పక్షుల పండుగ నిర్వహించనున్నారు. - 8లో



ప్రతి అర్జీకి పరిష్కారం
గ్రీవెన్స్‌లో ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జేసీ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. - 8లో



కండక్టర్‌పై దాడి
చంద్రగిరికి చెందిన ఆర్టీసీ కండక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ ర్యాంక్ సాధనే లక్ష్యం



ప్రసంగిస్తున్న వీసీ వీ.ఉమ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ జాతీయ స్థాయిలో 20225లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని వీసీ ప్రొఫెసర్ వీ.ఉమ పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ సావేరీ సెమినార్ హాల్‌లో నేషనల్ ర్యాంకింగ్–2025 కీలక మార్పులు, సవాళ్లు అనే అంశంపై నేషనల్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వర్సిటీ ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, 100లోపు ర్యాంకు సాధనే లక్ష్యంగా అధ్యాపకులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. అనంతరం వెల్లూరు వీఐటీ ప్రొఫెసర్ రాజశేఖర్‌బాబు మాట్లాడారు. ప్రొఫెసర్ వెంకటకృష్ణ, ఐక్యూఏసీ డైరెక్టర్ త్రిపురసుందరి, డీన్, పీఎం ఉషా ప్రాజెక్ట్ కో–ర్డినేటర్ సీ.వాణి, పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: యువత వ్యవసాయ రంగంపై మొగ్గు చూపాలని వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వర్సిటీ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన చౌదరిచరణ్‌సింగ్ జయంతిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చరణ్‌సింగ్ రైతులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారుడు గంగాధర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, నాగలక్ష్మి, విజయ, కామాక్షి పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతోనే అధిక దిగుబడి



రైతు కిసాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, రైతులు

తిరుపతి సిటీ: రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడిని పొందాలని ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జువారి వ్యవసాయ అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ రైతు దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వ్యవసాయరంగంలో నూతన టెక్నాలజీ వినియోగించినప్పుడే నాణ్యమైన దిగుబడికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం జువారి అగ్రి డెవలప్‌మెంట్ ల్యాబ్ డిప్యూటీ జీఎం డాక్టర్ బీ.సుధానంద్ రైతులకు నానో ఎరువులు, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలు, ఆరోగ్యకరమైన పంటలు, నాణ్యమైన దిగుబడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు కిసాన్ నూతన క్యాలెండర్‌ను అతిథులు, రైతులు ఆవిష్కరించారు. లక్ష్మీ కిషోర్, ఎన్ సుమాంజలి, ఎల్ వీరాచారి, ఉమ్మడి జిల్లాల రైతులు పాల్గొన్నారు

పోలీస్ గ్రీవెన్స్‌కు 65 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 65 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వెంటనే సంబంధిత అర్జీలను పరిష్కరించాలని ఆయా స్టేషన్ల సిబ్బందిని ఆదేశించారు.



పరేషన్!

చౌకదుకాణాలకు రాజకీయ గ్రహణం పట్టడంతో జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. కూటమి సర్కారు కొలువుదీరగానే మొదట టార్గెట్ చేసింది రేషన్ డీలర్లనే. వైఎస్సార్‌సీపీకి అనుకూలమంటూ.. 6ఏ కేసులు పెడతామంటూ పలువురు డీలర్ల చేత బలవంతంగా రాజీనామా చేయించారు. అధికారులు వాటిని పచ్చచొక్కాలు వేసుకున్న వారి చేతుల్లో పెట్టేశారు. ఇదు అదునుగా పేదలకు అందాల్సిన కందిపప్పు, చక్కెర, ఇతర సరుకులను కొందరు డీలర్లు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. వీటిపై నిఘా పెంచాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తుండడం గమనార్హం.

– తిరుపతి అర్బన్

- రేషన్ దుకాణాల్లో పూర్తి స్థాయిలో అందని నిత్యావసర సరుకులు
- అరకొరగా కందిపప్పు, చక్కెర పంపిణీ
- వీటికి డీడీలే కట్టని కొందరు డీలర్లు
- 25 శాతం రేషన్ డీలర్లు ఖాళీ
- మార్కెట్లో కిలో కందిపప్పు రూ.200, కేజీ చక్కెర రూ.45
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న పలువురు ఎల్లో డీలర్లు
- కొత్తకార్డుల ఊసేలేదు
- కొత్త సంవత్సరంలో అయినా అన్నీ సవ్యంగా పంపిణీ జరిగేనా ?

జిల్లా సమాచారం

రేషన్ దుకాణాల సంఖ్య 1,457	కార్డుదారుల సంఖ్య 6,03,000
ప్రతి నెలా వచ్చే బియ్యం 8350 మెట్రిక్ టన్నులు	ఎండీయూ వాహనాల సంఖ్య 369
అందుబాటులో ఉండే ఎండీయూ వాహనాలు 190	డిసెంబర్‌లో రావాల్సిన కందిపప్పు 600 మెట్రిక్ టన్నులు
వచ్చిన కందిపప్పు 350 మెట్రిక్ టన్నులు	వచ్చిన చక్కెర 80 శాతం మాత్రమే

ఆర్నెళ్లుగా అరకొరగానే పంపిణీ

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బియ్యం మాత్రం పూర్తి స్థాయిలో ఇస్తూ కంది పప్పు, చక్కెర మాత్రం కార్డుదారులకు అరకొరగానే పంపిణీ చేస్తున్నారు. గత సర్కారులో బియ్యం, కందిపప్పు, చక్కెర, ఆయిల్, గోధుమపిండి, రాగులు, రాగిపిండి తదితర అనేక సరకులు కార్డుదారులకు ఇచ్చేవారు. అయితే ఆ కూటమి సర్కారులో రేషన్ సరుకులు నామమాత్రంగా ఇస్తున్నారని పలువురు కార్డుదారులు ఆరోపిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాలు కూటమి ప్రభుత్వంలోని నేతల చేతుల్లోకి వెళ్లాయి. గత ప్రభుత్వంలో కార్డుదారుల ఇళ్లవద్దకే వెళ్లి ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులు అందించేవారు. రేషన్ పంపిణీ వ్యవస్థ సక్రమంగా నిర్వహణలో ఉండేది. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో నాటి నుంచి పేదలకు పూర్తిస్థాయిలో సరుకులు అందడం లేదు. ఫిర్యాదు చేస్తే స్పందించే అధికారి లేదు. దీంతో తెలుగు తమ్ముళ్ల అండదండలు ఉన్న పలువురు డీలర్లు కందిపప్పు, చక్కెర, ఇతర సరుకులను బ్లాక్‌లో విక్రయించి పేదల కడుపు కొడుతున్నారు. 50 శాతం ఎండీయూ వాహనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.



ఒక్కసారే బయోమెట్రిక్



రేషన్ దుకాణాల్లో సరుకులు ఇవ్వడానికి డీలర్ ప్రతి నెలా కార్డుదారుల నుంచి ఈపోస్ మిషన్‌లో బయోమెట్రిక్ తీసుకుంటారు. అయితే కార్డుదారులకు బియ్యం ఒకటే ఇస్తున్నప్పటికీ చక్కెర, కందిపప్పు, ఇతర సరుకులు ఇచ్చామని డీలర్లు బయోమెట్రిక్ ఒకేసారి నమోదు చేసుకుంటున్నారు. దీంతో ఆయా డీలర్లు ఎవరెవరికి ఏయే సరుకులు ఇచ్చారో అనే లెక్కను సివిల్ సప్లయ్ అధికారులు తేల్చలేకపోతున్నారు. ఇదే అదునుగా కొందరు డీలర్లు కందిపప్పును అధిక రేట్లకు మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. బియ్యానికి డీడీ కట్టాల్సిన పనిలేదు. కందిపప్పు, చక్కెర, ఇతర వస్తువులకు మాత్రమే ముందుగా బ్యాంక్‌లో డీడీ కట్టి సివిల్ సప్లయ్ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. కొందరు డీలర్లు డీడీల జోలికి వెళ్లడం లేదనే చర్చ సాగుతోంది. కొందరు కార్డుదారులడిగినా ఫలితం లేకుండా పోతోంది.

కొత్తకార్డులకు మోక్షమెప్పుడో ?



కూటమి సర్కారులో కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. డిసెంబర్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని, నవంబర్ చివరి వారంలో అధికారులు వెల్లడించారు. అయితే దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబర్‌లో వీలు లేకపోవడంతో వచ్చే జనవరి నుంచి అందుబాటులో ఉండొచ్చని చెబుతున్నారు. ఈఆర్నెళ్లలో ఒక్కటంటే ఒక్క కొత్త రేషన్‌కార్డు ఇవ్వలేదు. ఇప్పటికే 25 వేల మంది కొత్త కార్డుల కోసం నిరీక్షణ చేస్తున్నారు. మరో 30 వేల మంది కొత్త రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. మరో 6 వేల మంది రేషన్‌కార్డులను పోగొట్టుకున్నారు. సచివాలయానికి వెళ్తే 'ప్రభుత్వం మారింది.. కొత్త డిజైన్‌తో కొత్త సంవత్సరంలో కార్డులు వస్తాయి.. అప్పటి వరకు వేచి ఉండండి' అని ప్రజలకు చెబుతున్నారు.

భర్తీ ఎప్పుడో..?

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత 360 మందికి పైగా డీలర్ల చేత రాజీనామాలు చేయించారు. ఖాళీగా ఉన్న ఆయా దుకాణాలను పచ్చనేతల ఆధ్వర్యంలో అనధికారికంగా నడిపిస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉండే డీలర్ పోస్టులను ఆర్డీఓ నేతృత్వంలో భర్తీ చేస్తున్నారు. అయితే తిరుపతి జిల్లాలో ఇప్పటి వరకు ఖాళీల భర్తీపై దృష్టి పెట్టడం లేదు. నిత్యావసరసరుకులు పక్కదారిపడుతున్నాయన్న విమర్శలున్నాయి.

బయట మార్కెట్లో ధరలు అధికం

మార్కెట్‌లో కందిపప్పు కేజీ రూ.200కు పైగా ఉంది. రేషన్ దుకాణంలో రూ.67 మాత్రమే. కేజీపై రూ.133 తేడా ఉంటే కార్డుదారులు ఎందుకు తీసుకోరు ? జిల్లాలోని 1,457 రేషన్ దుకాణాల పరిధిలో 6,03,000 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుకు రూ.కేజీ చొప్పున అయితే 600 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. అయితే అందులో 350 మెట్రిక్ టన్నులు మాత్రమే డిసెంబర్‌లో వచ్చింది. మిగిలిన 250 మెట్రిక్ టన్నుల మాటేంటో తెలియడం లేదు. కార్డుదారులు అడిగితే ఈ నెలలో స్టాక్ లేదు..వచ్చే నెలలో ఇస్తామని డీలర్లు చేతులెత్తేస్తున్నట్టు సమాచారం.

కందిపప్పు అందుబాటులోకి తీసుకొస్తాం



సముద్రతీర ప్రాంతాలతోపాటు పలుచోట్ల కందిపప్పు అడగలేదని పలువురు డీలర్లు డిసెంబర్‌లో డీడీలు కట్టలేదు. దాంతో కొంతమేర ఇబ్బందులు వచ్చాయి. జనవరి నుంచి అలాంటి పరిస్థితులు లేకుండా డీలర్లకు పూర్తి అవగాహన కల్పిస్తాం. అందరిచేత కందిపప్పు, చక్కెరకు డీడీలు కట్టిస్తాం. ఎక్కువ సంఖ్యలోనే డీలర్ షాపులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి ఆర్డీవోలు కసరత్తు చేస్తున్నారు. త్వరలో భర్తీ చేస్తారు.

– శేషాచలం రాజు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ఆరు నెలల్లో రూ.15 వేల కోట్ల భారం

- ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు, ధరలు పెంచమన్న చంద్రబాబు
- 27న విద్యుత్ చార్జీల పెంపుపై వినతి పత్రాల సమర్పణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపు



కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ఎన్నికల ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన నీచుడు చంద్రబాబు అని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 27వ తేదీన విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలను సమర్పించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈనేపథ్యంలో సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసంలో కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆయనతోపాటు మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హామీలు తప్ప అమలు ఏదీ చంద్రబాబు అని ప్రశ్నించారు. ఎన్నికలముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు, ఇతర ధరలు ఏపీ పెంచమన్న చంద్రబాబు.. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ. 15వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని మండిపడ్డారు. అధికారం కోసం ఎన్ని అబద్ధాలైనా చెప్పడం, ఎవ్వరినైనా వంచించడం, నమ్మినవారిని నట్టేట ముంచడం చంద్రబాబు నైజమన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని కూడా నెరవేర్చని ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలతో కలిసి పోరాడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరెడ్డి, కోటూరు ఆంజనేయులు, అజయ్‌కుమార్, నల్లాని బాబు, పెరుగు బాబూయాదవ్, తిరుమలరెడ్డి, అనీల్‌రెడ్డి, ఇమ్రాన్‌బాషా, ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.

నేడు టీటీడీ పాలక మండలి సమావేశం

తిరుమల: తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం పాలకమండలి సమావేశం జరగనుంది. ఇందులో పలు కీలక అంశాలను చర్చించనున్నట్లు తెలిసింది. వైకుంఠ ఏకాదశి, జనవరి ఫస్ట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.


శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 77,260 మంది స్వామివారిని దర్శించుకోగా 24,223 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జనవరి 5న స్థానికులకు శ్రీవారి దర్శనం టోకెన్లు

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుపతి స్థానికులకు 2025, జనవరి 5న స్థానిక దర్శన కోటా టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. గత టీటీడీ బోర్డులో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. 2025, జనవరి 7వ తేదీ మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు జనవరి 5న తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల బాలాజీ నగర్‌లో శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక క్రిస్మస్



పిల్లలతో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కొనియాడారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ పిల్లలతో పాటు కేక్‌కట్ చేశారు. వారి ఆటపాటలను ప్రోత్సహించారు. డీఆర్వో నరసింహులతోపాటు పలువురు చర్చి పాస్టర్లు, క్రైస్తవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. తాను మిషనరీ స్కూల్‌లో చదువుకున్నాని చెప్పారు. దేవదూత అయిన జీసస్ క్రీస్తు చూపించిన మార్గాన్ని, త్యాగాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ కార్పొరేషన్ అధికారి హరినాథ్‌రెడ్డి, క్రిస్టియన్లు సాల్మన్‌రాజు, డేనియల్ బాబు, జాన్సన్, అరిల్ అరసు, శరత్‌బాబు, వేదనాయడు, జయపాల్ పాల్గొన్నారు.

శ్మశానంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

- వెంటనే ఆక్రమణలు తొలగించండి
- పాత శ్మశానాన్ని కొనసాగించండి
- ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న స్థానికులు



50వ డివిజన్ కార్పొరేటర్ అనిల్‌ను పంపేస్తున్న పోలీసులు



శ్మశానంలో ఆక్రమణలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న కార్పొరేటర్, స్థానికులు

తిరుపతి అర్బన్: 'తిరుపతి తిమ్మినాయుడుపాళెం ఎస్సీ కాలనీలోని శ్మశానాన్ని టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఆక్రమించేశారు. వెంటనే వాటిని తొలగించండి' అంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన 50వ డివిజన్ కార్పొరేటర్ అనిల్‌తోపాటు స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం తిమ్మినాయుడుపాళెం పరిధిలోని తిరుమలనగర్ సచివాలయ సమీపంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు టీడీపీ, జనసేన నేతలు, ఆర్డీవో రామమోహన్, తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వ భూములు ఆక్రమించి ఉంటే వెంటనే వాటిని తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో శ్మశానాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ క్రమంలో కొందరు టీడీపీ నేతలు జోక్యం చేసుకుని తిమ్మినాయుడుపాళెం ఎస్సీకాలనీకి శ్మశానం లేదని, సమీపంలో ఫారెస్ట్ భూములు ఉన్నాయని, అందులో శ్మశానం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు. అక్కడే ఉన్న 50 డివిజన్ కార్పొరేటర్ అనీల్‌తోపాటు పలువురు స్థానికులు కలుగజేసుకుని తమకు వందేళ్ల నుంచి శ్మశానం ఉందని చెప్పారు. అయితే ఆ శ్మశాన స్థలాన్ని పలువురు టీడీపీ నేతలు ఆక్రమించారని, ఆక్రమణలు తొలగిస్తే తమకు శ్మశానం సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. దీంతో జోక్యం చేసుకున్న పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్‌తోపాటు స్థానికులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని పంపించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత వారు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

రోడ్డుపైనే రెవెన్యూ సదస్సు

తిరుమల నగర్‌లోని సచివాలయానికి సమీపంలో రోడ్డుపైనే రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆ మార్గం మీదుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఉండే ప్రాంతంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేయడంతోపాటు సకల సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదిలావుండగా రెవెన్యూ సదస్సుకు మొత్తం 70 అర్జీలు వచ్చాయి. అందులో 50 శాతం అర్జీలు 22ఏ భూసమస్యల కింద వచ్చినవేనని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 1వ వార్డు కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, టీడీపీ నేతలు నరసింహయాదవ్, కృష్ణయాదవ్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, శ్రీధర్‌వర్మ, జనసేనా పార్టీ నేత రాజారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న ఆప్షనల్ హాలిడే

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఆప్షనల్ హాలిడేగా ప్రకటించినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ అటెండెన్స్ యాప్‌లో ఆప్షనల్ హాలిడేను నమోదు చేసి సెలవును వినియోగించుకోవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఎంపిక



ఉద్యోగమేళకు హాజరైన యువతీ, యువకులు

సత్యవేడు: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు సత్యవేడు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ చైతన్యచక్రవర్తి తెలిపారు. 32 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా.. 21 మంది ఎంపికైనట్టు ఆయన వెల్లడించారు. శ్రీసిటీలో బ్లూఓషన్, డైకిన్ కంపెనీల్లో వారు ఉద్యోగాలు సాధించినట్టు పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు గోపి, చంద్రబాబు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు స్టాఫ్‌నర్స్ బలి

తిరుపతి క్రైం: వరకట్న వేధింపులు తాళలేక స్టాఫ్ నర్సు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేట్ ఉద్యోగి పని చేస్తున్న గణేష్ మూడేళ్ల క్రితం పార్వతమ్మ(27)ను పెళ్లి చేసుకున్నాడు. ఈమె పద్మావతి హృదయలయ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తోంది. వీరికి ఒకటిన్నర సంవత్సరం బాబు కూడా ఉన్నాడు. వీరు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీటీడీ క్వార్టర్స్ అయిన వినాయకనగర్‌లో నివాసముంటున్నారు. గత కొంతకాలంగా గణేష్ అధిక వరకట్నం కోసం వేధించేవాడు. తరచూ పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసేవాడు. ఇదేవిధంగా ఆదివారం రాత్రి వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. అయితే తీవ్ర మనస్తాపానికి గురైన పార్వతమ్మ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గణేష్ వెంటనే తన అక్క రేవతికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపాడు. తర్వాత ఆమెతో కలిసి పార్వతమ్మని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతురాలు తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తిరుపతి డీఎస్పీ వెంకట్ నారాయణ దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

యశోద నగర్‌లో చోరీ

నగరంలో యశోదనగర్‌లో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. యశోదనగర్‌లో నివాసం ఉంటున్న ఈశ్వరి అన్నమాచార్య కళాక్షేత్రం ప్రాజెక్టులో తుంబుర వాయిస్తారు. ఈమె భర్త కోడూరులో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కూతురి ఇంటికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాలు కట్ చేసి.. ఇంటి తాళాలు పగులగొట్టారు. ఇంట్లో ఉన్న 44 గ్రాముల బంగారును దోచుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ప్రకృతి అందాల హరివిల్లు పులికాట్ సరస్సును అధారంగా చేసుకుని ప్రతి ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే జనవరి నుంచి మూడు రోజులు పక్షుల పండుగ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

విహంగం.. చూసి తరిద్దాం!

- జనవరి 10, 11, 12 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్స్
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండల కేంద్రాలుగా చేసుకుని నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ (సముద్రపు రామచిలుక పండుగ)ను నాలుగేళ్ల తర్వాత మళ్లీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 10, 11, 12 తేదీలలో పండుగను నిర్వహించేందుకు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఇప్పటికే పలు సమావేశాలను నిర్వహించారు.

ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల్లో సుమారు 620 చదరపు కిలోమీటర్లు పులికాట్ సరస్సును విస్తరించి ఉంది. విదేశీ వలస పక్షులకు ఈ సరస్సు ఆహార కేంద్రంగా, నేలపట్టు చెరువును సంతానోత్పత్తి కేంద్రంగా ఉపయోగించుకుంటూ తమ జీవనశైలిని ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నాయి. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినపుడు కాళంగి, స్వర్ణముఖినది, తమిళనాడులో అరణియార్, ఏడుకళ్లవారధి, పాములకాలువ, కరిపేటి కాలువల నుంచి వర్షపు నీరు సరుస్సులో కలుస్తుంది. బంగాళాఖాతం నుంచి పులికాట్ సరస్సుకు ముఖద్వారాల ద్వారా సముద్రంలో ఏర్పడే ఆటుపోట్లకు ఉప్పునీరు కలుస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలిసిన సంగమం కావడంతో మత్స్యసంపద విపరీతంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో కాకినాడ పండుగ, విశాఖ ఉత్సవ్ తరహాలో ఇక్కడ కూడా ప్రతి ఏటా పండుగను నిర్వహిస్తూ వచ్చారు. అయితే 2020, 2021లో కరోనా రావడం ఆపై పరిస్థితులు సహకరించకపోవడంతో నాలుగేళ్లు పండుగను చేసుకోలేకపోయారు.

1976లో పులికాట్, నేలపట్టును పక్షుల రక్షిత కేంద్రంగా ప్రకటన

1976లో వన్యప్రాణి సంరక్షణా చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం సూళ్లూరుపేట, నేలపట్టులో పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. బాంబే నేచురల్ బర్డ్స్ సొసైటీ వారు పులికాట్, నేలపట్టుకు వచ్చే విదేశీ వలస విహంగాలపై ఎన్నో రకాలుగా అధ్యయనం చేశారు. ముఖ్యంగా సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, రష్యా, ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్థాన్ లాంటి దేశాల నుంచి పక్షులు వస్తున్నాయని గుర్తించారు. 1976 నుంచి సరస్సు పరిరక్షణకు సిబ్బందిని కూడా నియమించారు. అయితే వీరు సరస్సును రక్షించడం కన్నా కార్యాలయానికే పరిమితమవుతున్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్స్ సృష్టికర్త కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

2000 సంవత్సరంలో నెల్లూరు జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన ప్రవీణ్‌కుమార్ ఓ మారు కుటుంబంతో పులికాట్ సరస్సు సందర్శనకు వచ్చారు. తడ పడవల రేవు వద్ద పడవ షికారు చేసిన సమయంలో వేల సంఖ్యలో ఫ్లెమింగోలు దర్శనమిచ్చాయి. ఇలాంటి దృశ్యాలను పర్యాటకుల దృష్టికి ఎందుకు తేకూడదని ఆయనలో పుట్టిన ఆలోచనే నేటి ఫ్లెమింగోఫెస్టివల్. అనాటి ఎమ్మెల్యే పరసా వెంకటరత్నయ్యకు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఆయన కలెక్టర్ ఆలోచనలకు ప్రాణం పోశారు. అప్పటి ప్రభుత్వం పండుగ నిర్వహణకు రూ.10 లక్షలు మంజూరు చేసింది. 2001 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు.

కనువిందు చేస్తున్న విదేశీ విహంగాలు



వర్షాలు కురిసి సరస్సు జలకళ సంతరించుకోవడమే తరువాయి సుమారు 150 నుంచి 160 రకాలు పక్షులు ఇక్కడి వస్తుంటాయి. పులికాట్ సరస్సులో లక్షలాది పక్షులు ఆహారవేటలో ఉన్నప్పుడు అవి చేసే విన్యాసాలు పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. ఇందులో ఫ్లెమింగోలు (సముద్రరామచిలుక), పెలికాన్ (గూడబాతులు), పెయింటెడ్‌స్టార్క్స్ (ఎర్రకాళ్ల కొంగలు) ఓపెన్‌బిల్ స్టార్క్స్ (నల్లకాళ్ల కొంగ), సీగల్ (సముద్రపు పావురాళ్లు), నారాయణపక్షి, నల్లబాతులు, తెల్లబాతులు, పరజలు, తెడ్డు ముక్కు కొంగ, నీటికాకులు, చింతవక్క, నత్తగుల్లకొంగ, చుక్కమూతి బాతులు, సూదిమొన బాతు లు, స్వాతికొంగలు లాంటి అనేక విదేశీ, స్వదేశీ పక్షులు ఇక్కడ దర్శనమిస్తుంటాయి. అందుకే దీన్ని పక్షుల భూతల స్వర్గంగా పిలుస్తుంటారు.

మూడు రోజుల పండుగ

ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు పక్షుల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మూడు రోజులు ఎగ్జిబిషన్ స్టాల్స్, ప్రతిరోజూ సినీ తారలు, సినీ యాంకర్స్‌తో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పులికాట్ సరస్సు పరిరక్షణపై పర్యావరణ వేత్తలతో సెమినార్లు నిర్వహిస్తారు. తడ మండలంలో తడ, భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికార్ ఏర్పాటు చేస్తున్నారు. నేలపట్టు చెరువులో పక్షులు సందర్శన, అక్కడే పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పక్షులకు సంబంధించిన షో, సూళ్లూరుపేట–శ్రీహరికోట, అటకానితిప్ప– పేర్నాడు, అటకానితిప్ప–వేనాడుకు వెళ్లే రోడ్లల్లో పక్షుల గుంపులను వీక్షించేలా చర్యలు చేపడుతున్నారు. అటకానితిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞానకేంద్రం వద్ద కూడా షో నిర్వహించనున్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అన్ని ప్రభుత్వ శాఖలు వారు నిర్వహించబోయే ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ఉద్యానవన శాఖ, షార్ వారు ఏర్పాటు చేసే స్టాల్స్ ప్రతిఏటా ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి శ్రీసిటి సెజ్‌లో కంపెనీల గురించి ప్రత్యేకమైన స్టాల్ ఏర్పాటు చేయనున్నారు.

ఫ్లెమింగోల ప్రత్యేకత

పులికాట్ సరస్సుకు వచ్చే అతి అందమైన విదేశీ వలస పక్షుల జాతుల్లో ఫ్లెమింగోలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ పక్షులు హంసలను పోలి ఉంటాయి. ఇవి శాఖాహార పక్షులు. సరస్సులో ఈ పక్షులు మాత్రమే చేపలు తినకుండా కేవలం నాచును ఆహారంగా తీసుకుంటాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. అత్యంత అందమైన పక్షి కాబట్టే దీనికి ఫ్లెమింగో పేరుతో నామకరణం చేశారు.



తడ మండలం భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్‌షికార్ చేస్తున్న పర్యాటకులు



పులికాట్ సరస్సు మీద ఆహారవేటలో ఫ్లెమింగోలు

ప్రతి అర్జీకి పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జేసీ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా వ్యాప్తంగా 243 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలపైనే 153 అర్జీలు ఉన్నట్టు జేసీ వెల్లడించారు.

స్పందనకు వందనం

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఓ క్రమపద్ధతిలో చేపట్టారు. అధికారులు సమయపాలన పాటించకపోవడంతోపాటు అర్జీదారులకు సౌకర్యాలు కల్పించలేదని 'సాక్షి' పలు కథనాలు వచ్చిన నేపథ్యం అధికారులు స్పందించారు. ముందుగా అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మేరకు కుర్చీలు తెప్పించారు. మరోవైపు తాగునీటి సౌకర్యం కల్పించారు. సిపార్స్‌ల ప్రాధాన్యతను తగ్గించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రీవెన్స్‌ను 9.55కే మొదలుపెట్టారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు వంద శాతం హాజరయ్యారు.

గ్రీవెన్స్‌లో మార్పు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ తొలిసారిగా ఓ మార్పును తీసుకొచ్చారు. అర్జీదారులు తమ సమస్యను ఆ విభాగానికి చెందిన అధికారి వద్ద కూర్చుని తెలియజేయడానికి వీలుగా టెబుల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి రగ్బీ, కుస్తీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కోట: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కోటలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థి ఐ.శివయ్య ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు జిల్లా వెలిగొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్టు ఆయన పేర్కొన్నారు. బీహార్‌లో ఈ నెల 27 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అదే విధంగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ పిఠాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పదో తరగతి విద్యార్థి శంకర్ 41 కేజీల గ్రీకోరోమన్ విభాగంలో స్వర్ణం సాధించగా, పార్థసారథి 57 కేజీల గ్రీకోరోమన్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి సేలంలో జరిగే సౌత్‌జోన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు పీడీ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

కండక్టర్‌పై దాడి



ఘటనా స్థలంలో లభ్యమైన పెన్ను

చంద్రగిరి: ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. చంద్రగిరి భారతీ నగర్‌కు చెందిన సుధాకర్ కుప్పం డిపో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని అర్ధరాత్రి సమయంలో ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్ఎఫ్ రోడ్డులో వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సుధాకర్‌పై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. సుధాకర్ తలకు తీవ్ర గాయమైంది. ఆ తర్వాత కూడా అతనిపై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. అనంతరం పెన్నుతో తల, మెడపై పొడవడంతో సుధాకర్ కేకలు వేశాడు. స్థానికులు అక్కడకు చేరుకోవడంతో దాడికి పాల్పడిన వారు పరారయ్యారు. తీవ్ర రక్తస్రావం కావడంతో సుధాకర్‌ను ముందుగా చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వారిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దాడికి గల కారణంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

– ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు





మృతి చెందిన బాలాజీ, బాలాజీ (ఫైల్)

చంద్రగిరి: వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన బాలాజీ(40) వివాహ శుభకార్యాలకు ఫ్లవర్ డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత పనులపై తన భార్య మాధవితో కలసి ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కోదండరామాపురం వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య మాధవి గాయాలపాలైంది. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా కొంత దూరం వెళ్లిపోయి, కారు డ్రైవరు కారును పక్కకు పెట్టేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మాధవిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా జగదీశ్వర్‌రెడ్డి జన్మదినోత్సవం



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి రోజా

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ నేత చొక్కా రెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి ఆర్‌కే రోజా హాజరయ్యారు. కుటుంబసభ్యులతో సరదాగా మాట్లాడారు. పిల్లలను ఆశీర్వదించారు.

రూ.4.49 లక్షల ఎరువులు సీజ్



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి ప్రతాప్

కలువాయి: కలువాయి ఆగ్రో విక్రయ సేవా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న రూ.4.49 లక్షల విలువ గల ఎరువులను సోమవారం సీజ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రతాప్ తెలిపారు. ఐపీఎల్ యూరియా 650 బస్తాలు, ఐపీఎల్ పొటాష్ 180 బస్తాలు సదరు ఎరువుల లైసెన్సులో 0ఫారం ఇంక్లూడ్ కాకుండా, అదేవిధంగా స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయకుండా విక్రయిస్తున్నారని సాధారణ తనిఖీల్లో వెల్లడైనట్టు తెలిపారు. కలువాయి మండలంలో వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, యూరియా కృత్రిమ కొరతను సృష్టించినా, ఇతర కాంప్లెక్సు ఎరువులతో యూరియాను లింక్ చేసి అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

భార్య వివాహేతర సంబంధం.. భర్త ఆత్మహత్య



మోహన్‌ఆచారి (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): భార్య అక్రమ సంబంధం జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉడ్యాణంపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, అలాగే స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఉడ్యాణంపల్లెకు చెందిన రవి ఆచారి కుమారుడు మోహన్ ఆచారి(36)కి పాకాల మండలం, గాదంకి గ్రామానికి చెందిన సరితతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అయితే కొంతకాలంగా సరిత గుంటిపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో 50 రోజులుగా ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. అయినా ఆ ప్రభుత్వ ఉద్యోగితోనే ఉంటానంటూ భార్య తేల్చి చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన మోహన్‌ఆచారి సోమవారం సెల్ఫీ వీడియో తీసి గ్రామస్తులకు తమ గోడు వెళ్లబోసుకున్నాడు. ఉదయం ఆ వీడియో చూసిన గ్రామస్తులకు మోహన్ ఆచారి కనిపించక పోవడంతో వెతకడం మొదలు పెట్టారు. గ్రామానికి సమీపంలోని ఓ క్వారీపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు – వెంకటగిరి మార్గంలోని చిందేపల్లి స్టేజ్ వద్ద సోమవారం బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు.. ఏర్పేడు మండలం, దుర్గపేరి గ్రామానికి చెందిన గాది వెంకటేష్ (36) ద్విచక్ర వాహనంపై కూలీల కోసం చిందేపల్లి గిరిజన కాలనీకి వెళ్తున్నాడు. అదే సమయంలో ఏర్పేడు నుంచి వెంకటగిరి వైపు వెళుతున్న బొలెరో వాహనం వెంకటేష్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో వెంకటేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.